సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం ၊ 26 ၊ నవంబర్ ၊ 2024



చెలరేగిన బ్యాట్స్‌మెన్

కడపలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జోనల్ క్రికెట్ పోటీల్లో బ్యాట్స్‌మెన్ చెలరేగడంతో మూడు సెంచరీలు నమోదయ్యాయి. -8లో



ఆలయానికి రాజకీయ రంగు

చెన్నూరు మండలంలోని శివాలపల్లె వద్ద వెలసిన శ్రీ కాశీ విశ్వనాథస్వామి ఆలయానికి రాజకీయ రంగులదిద్దారు. -8లో

గరిష్టం/కనిష్టం
30.2/19.9

వాతావరణం

జిల్లాలో సోమవారం 19.9 - 30.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుడికి అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న గంగిరెడ్డి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోషియల్ టీచర్‌గా పనిచేస్తున్న ఎం.గంగిరెడ్డి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పెద్దలు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.గంగిరెడ్డికి మండల విద్యాశాఖ అధికారులు శివప్రసాద్, రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఓబీసీ కుల గణన చేపట్టాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : వచ్చే జనవరిలో కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జన గణనతోపాటు ఓబీసీ కుల గణనను కూడా చేపట్టాలని కోరుతూ ఏపీ బీసీ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం కడప కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, ప్రధాన కార్యదర్శి తివిక్రమ్‌లు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ జనగణన కమిటీ వెంటనే కార్యచరణ చేపట్టాలని కోరారు. చట్టసభల్లో ఓబీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించేందుకు పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం వెంటనే బిల్లు ప్రవేశ పెట్టాలన్నారు. ఓబీసీలకు ప్రత్యేకంగా కేంద్ర మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలన్నారు. మండల కమిషన్ సిఫారసులను తక్షణమే అమలు చేసేందుకు కేంద్రం చర్యలు చేపట్టాలన్నారు. రోహిణి కమిషన్ రిపోర్టును అమలు చేయాలన్నారు. ఓబీసీలపై రుద్దిన క్రిమిలేయర్‌ను కేంద్రం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఏపీఎస్ఐడీసీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెన్‌డౌన్



పెన్‌డౌన్ ద్వారా నిరసన వ్యక్తం చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న ఉద్యోగులకు ఆరు నెలలుగా వేతనాలు అందలేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. వేతన బకాయిలు సత్వరమే చెల్లించాలని, లేకుంటే ఈ నెల 25 నుంచి పెన్‌డౌన్ చేస్తామంటూ ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు గతంలోనే తెలిపారు. ఉద్యోగ భద్రతపైనా కారికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్‌శాఖలో విలీనం చేయాలని బాధితులు కోరుతున్నారు. కూటమి సర్కార్ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం నుంచి పెన్‌డౌన్ చేపట్టారు. కడపలోని ఏపీఎస్ఐడీసీ కార్యాలయం వద్ద పెన్‌డౌన్ ద్వారా నిరసన వ్యక్తం చేశారు.

నిత్యపూజస్వామికి రూ.1,25,365 ఆదాయం

సిద్దవటం : మండలంలోని లంకమల్ల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్య పూజస్వామి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రూ. 1,25,365 వచ్చిందని జిల్లా దేవదాయ శాఖ అధికారి మల్లికార్జునప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 18 నవంబర్ 2024 నుంచి 25 నవంబర్ 2024 వరకు భక్తులు స్వామి వారి హుండీలో వేసిన కానుకలు, ఆదాయాన్ని దేవదాయశాఖ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ రామప్రసాద్‌రెడ్డి, రాజంపేట ఇన్‌స్పెక్టర్ జనార్దన్ సమక్షంలో లెక్కించామన్నారు. ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటలబీమా పోస్టర్ విడుదల

కడప ఎడ్యుకేషన్ : ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయే రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకే పంటలబీమా ప్రవేశపెట్టారని జిల్లావ్యవసాయాధికారి అయితా నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం వ్యవసాయ కార్యాలయంలో జరిగిన డీఎల్ఎంసీ సమావేశంలో పంటలబీమా పోస్టర్లను వ్యవసాయ కార్యాలయ సిబ్బందితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్యాలయం ఏడీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఒంటిగంటకే ఫైనల్ బెల్

మధ్యాహ్నం ఒంటి గంట అయితే చాలు.. ఆ హైస్కూల్‌లో ఫైనల్ బెల్ కొట్టేస్తారు. వేసవి సహా కాలం ఏదైనా.. సోమ, మంగళ, బుధ.. రోజు ఏదైనా ఆ స్కూల్‌కు రోజూ ఒంటిపూట బడే. ఒకటి రెండు కాదు.. మూడు దశాబ్దాలుగా ఒంటిపూటే నడిచే ఏకైక హైస్కూల్‌గా రికార్డులకెక్కింది. అదే అన్నమయ్య జిల్లా నందలూరు జిల్లా పరిషత్ హైస్కూల్. ఐఏఎస్‌ల హైస్కూల్‌గా పేరొందిన ఈ హైస్కూల్‌కు 30 ఏళ్ల క్రితం పట్టిన గ్రహణం ఇప్పటికీ వీడటం లేదు.

- రాష్ట్రంలో ఏకైక ఒంటిపూట బడి
- విద్యార్థులకు శాపంగా మారిన ఇంటర్ బోర్డు నిర్వాకం
- 30 ఏళ్లుగా షిఫ్ట్ పద్ధతిలోనే చదువులు
- పడిపోతున్న 'ఐఏఎస్‌ల'హైస్కూల్ విద్యా ప్రమాణాలు



నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల కూడా ప్రాంగణంలోనే..

రాజంపేట : ఎందరో ఐఏఎస్‌లను, రాజకీయ ప్రముఖులను అందించిన నందలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఇంటర్‌మీడియెట్ బోర్డు పాతాళంలోకి తొక్కేస్తోంది. 30 ఏళ్ల క్రితం తాత్కాలికంగా కళాశాల తరగతులు నిర్వహించుకుంటామని చేరి శాశ్వతంగా అలాగే ఉండిపోయింది. దీంతో ఇటు హైస్కూల్ విద్యార్థులకు మధ్యాహ్నం వరకు.. అటు కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తరగతులు నడుస్తున్నాయి. కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం ఇప్పటికీ పరిష్కారం కాలేదు. 1908లో నందలూరులో బోర్డు హైస్కూల్ ఏర్పాటైంది. 1954లో జిల్లా పరిషత్ హైస్కూల్.. ఆ తర్వాత 1962లో జిల్లా హయ్యర్ సెకండరీ హైస్కూల్‌గా ఆవిర్భవించింది. ఒకప్పుడు విశాలమైన గదులు, లైబ్రరీ, ల్యాబ్, క్రీడా పరికరాలతో పాటు నాణ్యమైన బోధన, ఉత్తమ ఉపాధ్యాయులతో క్రమశిక్షణకు మారుపేరుగా హైస్కూల్ ఖ్యాతిగాంచింది. ఎందరో ఐఏఎస్‌లను అందించి చరిత్రలో నిలిచింది. ఇక్కడి హైస్కూల్‌లో తరగతులు ఉదయం 7.45కు ప్రారంభిస్తారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తారు.

జూనియర్ కళాశాల రాకతో హైస్కూల్ విద్యకు గ్రహణం

నందలూరు బస్టాండు నుంచి సౌమ్యనాథ ఆలయానికి వెళ్లే మార్గంలో విశాలమైన స్థలంలో ఈ హైస్కూల్ ఉంది. భవనాల కొరతతో 1982లో నందలూరులోని జూనియర్ కళాశాలను ఇక్కడికి మార్చారు. అంతే.. ఆ రోజు నుంచి హైస్కూల్ సమస్యల ఒడిలోకి జారుకుంది. సొంతభవనాల నిర్మాణం వరకు అని చెప్పిన ఇంటర్ బోర్డు నేటి వరకు ఇక్కడే కళాశాలను కొనసాగిస్తోంది. ఇక్కడి నుంచి కళాశాలను తరలించాలని జెడ్పీ హైస్కూల్ యాజమాన్యం ఎన్నిసార్లు మొత్తుకున్నా.. కలెక్టర్లు జోక్యం చేసుకున్నా ఫలితం లేదు. ప్రస్తుతం 274 మంది విద్యార్థులున్న ఈ హైస్కూల్‌లో మధ్యాహ్నం వరకు తరగతులు సాగుతున్నాయి. మధ్యాహ్నం నుంచి ఇంటర్ విద్యను కొనసాగిస్తున్నారు. షిఫ్ట్ విధానంపై విద్యార్థుల తిరుగుబాటు, ఆందోళనలు, ఉద్యమాలు జరిగినా పట్టించుకున్న పాపానపోలేదు.

రూ.లక్షలు వెనక్కి..

ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి ఈ షిఫ్ట్ విధానానికి స్వస్తి పలకాలని భావించారు. గత ప్రభుత్వంలో లక్షలాది రూపాయలు మంజూరు చేయించారు. పీహెచ్‌సీకి సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేశారు. నిర్మాణ పనులు చేపట్టే సమయంలో వివాదాలు తలెత్తాయి. అంతే పెండింగ్‌లో పడింది. జూనియర్ కళాశాలను మండల కార్యాలయాల కాంప్లెక్స్ సమీపంలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ హాస్టల్‌ను కేటాయించి అక్కడికి తరలించాలని ప్రయత్నించారు. జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. ఇంటర్ విద్యకు ఎస్సీ హాస్టల్‌ను ఆధునికీకరణ చేసి సరిపోతుందని భావించి ఆ దిశగా చర్యలు తీసుకున్నారు.

వ్యతిరేకిస్తున్న అధ్యాపకులు

ఏదో ఒక పూట వస్తున్నాం.. పాఠాలు చెప్పిపోతున్నాం.. అక్కడికి తరలిస్తే రెండు పూటలా కాలేజీకి రావాల్సి వస్తుంది అనుకున్నారో ఏమో... ఇంటర్ కళాశాలను తరలింపును కొందరు అధ్యాపకులు వ్యతిరేకిస్తున్నారు. మండల కాంప్లెక్స్ సమీపంలోని ఎస్సీ హాస్టల్ భవనాలు దూరమని.. అక్కడికి వెళితే ఇంటర్ బాలికలకు రక్షణ ఉండదని ప్రచారం చేశారు. నిజానికి మండల కాంప్లెక్స్ ఆవరణ ప్రశాంతంగా ఉంటుంది. దశాబ్దాలుగా అక్కడే వందలాది మంది బాలికలతో బీసీ గురుకుల పాఠశాల కూడా ఉంది. కేవలం తమ స్వార్థం కోసం అధ్యాపకులు చేసిన వ్యవహారం వల్ల తరలింపు ఆగిపోయిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా కలెక్టర్, డీఈవో, ఇంటర్ ఆర్‌జెడీ ఒకతాటిపైకి వచ్చి హైస్కూల్‌కు ఒంటిపూట బడి నుంచి విముక్తి కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఐఏఎస్‌ల హైస్కూల్‌గా ప్రసిద్ధి

ఐఏఎస్‌లను.. గొప్ప రాజకీయ నాయకులను దేశానికి అందించిన స్కూల్‌గా ఇది ఖ్యాతి గడించింది. జి.జగత్పతి, ఎ.ఉమాకాంతశర్మ, తిరువెంగళాచార్యులు, ఆకేపాటి విజయసాగర్‌రెడ్డి, జి.పెద్దరెడ్డయ్య ఈ హైస్కూల్‌లోనే చదివి ఐఏఎస్‌లయ్యారు. మాజీ గవర్నర్ ఎస్.ఓబులరెడ్డి, మాజీ మంత్రి బండారు రత్నసభాపతి, ఎంపీలు యెద్దుల ఈశ్వర్‌రెడ్డి, వై.ఆదినారాయణ రెడ్డి, డీఎన్ రెడ్డి వంటి దిగ్గజాలు ఈ హైస్కూల్‌లో విద్య అభ్యసించినవారే. జిల్లా బోర్డు అధ్యక్షుడిగా పనిచేసిన వై.పిచ్చిరెడ్డి, అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ఏబీ ఆదిశేషారెడ్డి, బ్రిగేడియర్ వి.శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే కసిరెడ్డి మదన్ మోహనరెడ్డి, ఐఎఎస్‌ల సృష్టికర్త ఆర్‌సీ రెడ్డి, ఐటీఎస్ ఎంవీ రమణయ్య, ఆర్టీసీ రీజినల్ మాజీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడుతో పాటు ఎందరో క్రీడాకారులుగా, ఉన్నతాధికారులుగా, ప్రజాప్రతినిధులుగా రాణించారు.

జూనియర్ కళాశాలను తొలగించాలి



జూనియర్ కళాశాల సొంత భవనాల కోసం రెండుసార్లు నిధులు మంజూరయ్యాయి. లాభం లేకపోయింది. పీహెచ్‌సీకి సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని జూనియర్ కళాశాల కోసం ఎంపిక చేశాం. దాన్ని అడ్డుకున్నారు. కళాశాలను ఎస్సీ హాస్టల్ భవనాల్లోకి మార్చేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. కానీ.. ఉద్దేశపూర్వకంగా కొందరు అధ్యాపకులు వ్యతిరేకించారు.

-మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ, నందలూరు

షిఫ్ట్ విధానం సరికాదు



ఐఏఎస్‌ల పాఠశాలగా దీనికి గుర్తింపు ఉంది. ఎందరో ఐఏఎస్‌లను అందించిన హైస్కూల్ నేడు విద్యాపరంగా దీనావస్థలో ఉంది. ఒకప్పుడు రెండుపూటలు జరిగేది. ఒక పూటకే పరిమితం కావడంతో విద్యార్థులకు బోధన కరువైంది. ఇంటర్ కళాశాలను వేరే ప్రాంతానికి తరలిస్తేనే హైస్కూల్ విద్య సక్రమంగా నడుస్తుంది. ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదు.

-సోమిశెట్టి సునీత, ఎంపీటీసీ, నందలూరు

ఏళ్ల తరబడి ఇదే దుస్థితి



నందలూరు హైస్కూల్‌లో ఏళ్ల తరబడి ఇంటర్ కళాశాలను కొనసాగింపును ఆపలేకపోతున్నారు. ఇంటర్ కళాశాలకు స్థలం, నిధులొచ్చినా ఉపయోగించలేకపోయారు. తరువాత నిరుపయోగంగా ఉన్న ఎస్సీ హాస్టల్ భవనాల్లోకి తరలిస్తే కొంతమంది అధ్యాపకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అడ్డుకున్నారు.

-సుభాన్‌బాషా, ఎంపీటీసీ, నందలూరు

కార్తికం.. కమనీయం

కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా జిల్లావ్యాప్తంగా సందడి నెలకొంది, ఆలయ ప్రాంగణాలు శివనామస్మరణతో మారుమోగాయి. కార్తిక దీపారాధనతో ఆలయాలు కాంతులీనాయి.పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో తెల్లవారుజాము నుంచే భక్తులు పెన్నా నదిలో స్నానాలు ఆచరించి కొండపై గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి, సంతాన మల్లేశ్వర, సాక్షి మల్లేశ్వర స్వామి ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. మహిళలు నదితో బాటు ఆలయ ధ్వజ స్తంభం వద్ద , ఆలయ ప్రాంగణంలో భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించారు.

–సాక్షి నెట్‌వర్క్



ప్రొద్దుటూరులోని ముక్తిరామలింగేశ్వరాలయంలో శివలింగాకారంలో దీపాలంకరణ



ఖాజీపేట: నాగనాథేశ్వర కొండపై స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలో వేచిఉన్న భక్తులు



కడపలోని మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సకాలంలో వినతుల పరిష్కారం

కలెక్టర్ శ్రీధర్



ప్రజల అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజలు సమర్పించే అర్జీలను జాప్యం లేకుండా సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

- సోమశిల బ్యాక్ వాటర్ వల్ల తమ గ్రామాల్లోకి నీరు వస్తోందని, వెంటనే తమకు నష్టపరిహారం చెల్లించి ఇళ్లను సేకరించాలని ఒంటిమిట్ట మండలం తప్పెటవారిపల్లె, పెన్నపేరూరు గ్రామాల ప్రజలు కోరారు. గతంలో సోమశిలలో 78 టీఎంసీల నీరు నిల్వ చేసినపుడు తమ ఇళ్లల్లోకి నీరు రావడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 60 టీఎంసీలు నిల్వ చేస్తే దోమలు, విష పురుగులు రావడంతోపాటు డెంగీ, ఇతర జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. కనుక భూ సేకరణ జరిపి ఆదుకోవాలని కోరారు.
- ఎర్రగుంట్ల మండలం వై.కోడూరు గ్రామ సర్వే నెంబరు 756–2, 788, 792 సర్వే నెంబర్లలోని 495 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని, వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్ కోరారు.
- గండికోటలో అక్రమంగా వసూలు చేస్తున్న టోల్‌గేట్ రద్దు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ కోరారు. వ్యక్తికి ఒక రేటు, వాహనాలకు ఒకరేటు, సెలవు రోజుల్లో మరో రేటుతో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కోట అభివృద్ధికి డబ్బులు వసూలు చేస్తున్నారనడం విడ్డూరంగా ఉందన్నారు. కోట పురావస్తుశాఖకు చెందినది కాగా, టూరిజం వారు టోల్ వసూలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించి జీఓ, సర్క్యులర్ ఏమి లేవన్నారు. డిజిటల్ ప్రింటింగ్ టిక్కెట్ కూడా ప్రజలకు ఇవ్వడం లేదన్నారు.

ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, ఐసీడీఎస్‌పీడీ శ్రీలక్ష్మి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ చొరవతో తెల్లపాడుకు ఆర్టీసీ బస్సు

కలసపాడు : మండలంలోని తెల్లపాడు గ్రామానికి సోమవారం ఆర్టీఓ చంద్రమోహన్ ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించారు. ఇటీవల పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా తెల్లపాడుకు వచ్చిన జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ దృష్టికి ప్రజలు ఈ విషయాన్ని తీసుకొచ్చారు. దీంతో బస్సు సౌకర్యం కల్పించాలని కలెక్టర్ ఆర్టీఓను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం తెల్లపాడుకు బస్సు సర్వీసును ఆర్టీఓ ప్రారంభించారు. తెల్లపాడు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు మధురవాణి తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి

- తగ్గుతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
- తెల్లవారుజాము నుంచి కమ్ముకుంటున్న పొగమంచు

గత ఐదు రోజుల్లో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు..

తేదీ	కనిష్ట	గరిష్ట
20.11.24	21.3	29.3
21.11.24	20.6	30.4
22.11.24	18.9	30.6
23.11.24	18.9	31.4
24.11.24	18.5	31.5



కడప మరియాపురం చర్చి వద్ద ఏర్పాటు చేసిన స్వెటర్ షాపులు

కడప అగ్రికల్చర్ : జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. రాత్రి ఉష్ణాగ్రతలు తగ్గాయి. మొన్నటి వరకు రాత్రులు 23, 24 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యేవి. అలాంటిది గత మూడు రోజుల నుంచి జిల్లాలో 18 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. తెల్లవారుజాము నుంచే పొగమంచు కురుస్తోంది. దీంతో జాతీయ రహదారుల వెంబడి వెళ్లే వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉషోదయాన్నే పంట పొలాలను మంచు దుప్పటి కప్పేస్తోంది. గ్రామాల్లో ప్రజలు చలిమంటలు వేసుకుంటూ శీతలాన్ని తగ్గించుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా నవంబర్ నెల 1వ తేదీ గరిష్ట ఉష్ణోగ్రత 33.8 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 23.6 డిగ్రీలు ఉండేవి. నవంబర్ 15వ తేదీ నాటికి గరిష్టం 31.0 డిగ్రీలు, కనిష్టం 23.9 డిగ్రీలుగా నమోదైంది. నవంబర్ 20 తేదీ గరిష్ట ఉష్ణోగ్రత 29.8 కనిష్ట ఉష్ణోగ్రత 21.3 డిగ్రీలు నమోదైంది. 24వ తేదీకి గరిష్ట ఉష్ణోగ్రత 31.5 ఉండగా కనిష్ట ఉష్ణోగ్రత 18.5కు చేరుకుంది. ఇప్పుడే ఇలా ఉంటే డిసెంబర్, జనవరి నెలల్లో చలి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన స్వెటర్లు, మంకీక్యాప్‌ల అమ్మకాలు

చలి పెరగడంతో స్వెటర్లు, మంకీక్యాప్‌లు, రగ్గుల అమ్మకాలు పెరిగాయి. మధ్యప్రదేశ్, భూపాల్ ప్రాంతానికి చెందిన కొందరు వ్యాపారులు కడపతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కన స్టాల్స్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ స్టాల్స్‌లో స్వెటర్లు, మంకీ క్యాపులు, గ్లౌజులు, రగ్గుల అమ్మకాలు చేస్తున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా చాలామంది జలుబు, దగ్గు, జ్వరాలు సోకుతున్నట్లు వైద్యులు తెలిపారు. ప్రతి ఒక్కరూ కాచిచల్లార్చిన నీటిని తాగాలని, వేడివేడి ఆహార పదార్థాలు తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

ఇప్పుడిప్పుడే వ్యాపారం ప్రారంభం..



ఏటా కడప నగరానికి ఉన్నిదుస్తుల అమ్మకం కోసం మధ్యప్రదేశ్ నుంచి వస్తాం. వారం రోజుల నుంచి వ్యాపారం ప్రారంభించాం.మొన్నటి వరకు పెద్దగా అమ్మకాలు లేవు. ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. మరోపది రోజులు గడిస్తే వ్యాపారం పెరుగుతుందని ఆశిస్తున్నాం.

- హుకుం సింగ్ హకలేశ్వర్, మధ్యప్రదేశ్

జాగ్రత్తలు అవసరం..



చలికాలం అనేక రోగాలను కూడా వెంట తెస్తుంది. ప్రజలు చలిలో బయటకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. చెవుల్లోకి గాలి వెళ్లకుండా చూసుకోవాలి. వృద్ధులు, పిల్లలు చలిలో తిరగకుండా చూడాలి.రాత్రిళ్లు చలిలో ప్రయాణాలు చేయరాదు.కాచి చల్లార్చిన నీరు తాగాలి.వేడి ఆహారం తీసుకోవాలి.

- డాక్టర్. ఎస్. మహబూబ్‌అలీ, ఎండీ,(ఫిజీషియన్), కడప

ఫసల్ బీమా సద్వినియోగం చేసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఈ ఏడాది రబీ పంటలకు ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో పంటల బీమా పథకానికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నువ్వులు, వేరుశనగ, పెసలు, జొన్నలు, మినుములు, వరి, పొద్దుతిరుగుడు, శనగ పంటలకు బీమా సౌకర్యం ఉంటుందన్నారు. గడువులోపు నమోదు కావాలన్నారు. బీమా చేసిన మొత్తానికి 1.5 శాతం ప్రీమియం చెల్లించాలన్నారు. వాణిజ్య, ఉద్యాన పంటలకు ఐదు శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. పంట వేసిన ధృవపత్రం జారీ నిమిత్తం కూడా ఎటువంటి మొత్తాన్ని రైతు సేవా కేంద్రంలోని సిబ్బందికి చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. బీమా చేసిన పంట వివరాలు ఈ–పంటలో సక్రమంగా నమోదయ్యాయో లేదో సరిచూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, ఎల్‌డీఎంజనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సెంచరీలతో చెలరేగిన బ్యాట్స్‌మెన్

తూర్పుగోదావరి, ప్రకాశం, సౌత్‌జోన్ జట్లు విజయం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జోనల్ అండర్-23 క్రికెట్ పోటీల్లో బ్యాట్స్‌మెన్ చెలరేగడంతో మూడు సెంచరీలు నమోదయ్యాయి. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెస్టాఫ్ సౌత్, రెస్టాఫ్ సెంట్రల్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సౌత్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 323 పరుగులు చేసింది. జట్టులోని పి.సుబ్రమణ్యం 130 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్సర్‌లతో 129 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఈయనకు జతగా ధరణికుమార్‌నాయుడు 59 పరుగులు చేశాడు. సెంట్రల్‌జోన్ బౌలర్లు రాజు 2, సుబ్బారావు 2, దీపక్‌చంద్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్టాఫ్ సెంట్రల్ జోన్ జట్టు 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. జట్టులోని స్వామినాయుడు 100 పరుగులు చేయగా, వసంత్‌వర్ధన 30 పరుగులు చేశాడు. సౌత్‌జోన్ బౌలర్లు ధరణికుమార్‌నాయుడు 5 వికెట్లు, ఆదిల్‌హుస్సేన్ 2 వికెట్లు తీశారు. దీంతో రెస్టాఫ్ ఆఫ్ సౌత్‌జోన్ జట్టు 117 పరుగుల తేడాతో విజయం సాధించింది.



క్రికెట్ పోటీల్లో మ్యాచ్ ఆడుతున్న ప్రకాశం, నార్త్‌జోన్ జట్లు



పి.సుబ్రమణ్యం, సౌత్‌జోన్ (129 పరుగులు)



స్వామినాయుడు, సెంట్రల్‌జోన్ (100 పరుగులు)



రోహిత్, ప్రకాశం (119 పరుగులు)

4 వికెట్ల తేడాతో గెలుపు

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, తూర్పుగోదావరి జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 268 పరుగులు చేసింది. జట్టులోని ప్రశాంత్ 64, మహేంద్రారెడ్డి 42 పరుగులు చేశాడు. తూర్పుగోదావరి బౌలర్లు శివసూర్య 2, వంశీనారాయణ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తూర్పుగోదావరి జట్టు 47.3 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 271 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని విజయ్ 53 పరుగులు చేశాడు. అనంత బౌలర్లు మల్లికార్జున 4, ప్రదీప్ 2 వికెట్లు తీశారు. కాగా తూర్పుగోదావరి జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

భారీ ఆధిక్యం

వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెస్టాఫ్ నార్త్‌జోన్ జట్టు, ప్రకాశం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నార్త్‌జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 345 పరుగులు చేసింది. జట్టులోని రోహిత్ 91 బంతుల్లో 6 ఫోర్లు, 11 సిక్సర్‌లతో 119 పరుగులు చేశాడు. అభినవ్ 75 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్లు అచ్యుత్ హేమంత్ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ జట్టు 48.5 ఓవర్లలో 266 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని హిమకర్ 64, రవికిరణ్ 65 పరుగులు చేశారు. ప్రకాశం బౌలర్లు సుమిత్ 4, పార్థసారథి 2, పవన్‌కుమార్ 2 వికెట్లు తీశారు. దీంతో ప్రకాశం జట్టు 79 పరుగుల భారీ ఆధిక్యంతో విజయం సాధించింది.

క్లుప్తంగా

అక్రమ మట్టి తవ్వకాలపై కొరడా

– జేసీబీ, 7 ట్రాక్టర్లు సీజ్



సీజ్ అయిన ట్రాక్టర్లు

బద్వేలు అర్బన్ : అక్రమ మట్టి తవ్వకాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. సోమవారం స్థానిక బయనపల్లె చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు సాగిస్తున్న ఒక జేసీబీ, 7 ట్రాక్టర్లను తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఇటీవల కాలంలో బద్వేలు మండల పరిధిలోని పలు చెరువులలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు అందుకున్న తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



ఆర్టీసీ బస్సు కింద పడిన ద్విచక్ర వాహనం

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని వైఎస్ పాల్‌రెడ్డి ఫంక్షన్ హాలు సమీపంలో సోమవారం ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో యమున అనే చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. జ్యోతి ఆసుపత్రి నుంచి ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా.. కదిరి డిపో నుంచి పులివెందులకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో చిన్నారితోపాటు ఆ చిన్నారి తండ్రికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

కోడి గుడ్ల వాహనాన్ని ఢీకొన్న లారీ

– డ్రైవర్‌కు గాయాలు



వాహనంలో నుంచి కింద పడిన కోడిగుడ్లు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం కడప రోడ్డులోని మెడికల్ కళాశాల సమీపంలో కోడిగుడ్ల బొలేరో వాహనాన్ని రేషన్ బియ్యం లారీ ఆదివారం రాత్రి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలేరో డ్రైవర్ ప్రసాద్ తలకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వేముల వైపు నుంచి పులివెందులకు వస్తున్న కోడిగుడ్ల బొలేరో వాహనాన్ని కడప నుంచి పులివెందులకు వస్తున్న రేషన్ బియ్యం లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలేరో వాహనం, లారీ ముందు భాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బొలేరో వాహన డ్రైవర్ ప్రసాద్‌కు గాయాలు కావడంతో చికిత్స కోసం దగ్గరలో ఉన్న వైఎస్సార్ సర్వజన ఆసుపత్రికి తరలించారు. సోమవారం ఉదయం ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆటోలో నుంచి పడి వృద్ధుడికి గాయాలు

మదనపల్లె : అంగళ్లుకు చెందిన గోపాల్‌రెడ్డి (71) సోమవారం ఆటోలో గోపాలపురానికి వెళుతుండగా మార్గంమధ్యలో ఆటో అదుపు తప్పడంతో.. ఆటోలో నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ఆయనను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

దేవాలయానికి రాజకీయ రంగు

- కాశీ విశ్వనాథస్వామి ఆలయ ఈఓ నిర్వాకం
- అధికార పార్టీ నేతల పట్ల భక్తి ప్రదర్శిస్తున్న వైనం



పోస్టర్లపై ముద్రించిన టీడీపీ నేతల చిత్రాలు

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలంలోని శివాలపల్లె వద్ద వెలసిన శ్రీ కాశీ విశ్వనాథస్వామి ఆలయానికి కార్యనిర్వహణ అధికారి రాజకీయ రంగులదిద్దారు. కొంత మంది అధికార పార్టీ నేతల కనుసనల్లో గుడి నిర్వహణ జరగడం వల్ల వీఐపీలు ముందు, భక్తులు వెనక అనే చందంగా కొనసాగుతోంది. ఇదే కాక ధనార్జనే ధ్యేయంగా తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు అభిషేకాలు చేయటం మూలాన సాధారణ భక్తులకు కాశీ విశ్వనాథస్వామి దర్శనం దక్కక, సోమవారం కొంత మంది భక్తులు ఆలయ నిర్వాహకులపై దాడికి యత్నించడం పరిపాటిగా మారిపోయింది. ప్రతి ఏడాది కార్తిక మాసంలో జరిగే కార్యక్రమ వివరాలను తెలియజేస్తూ అధికారికంగా ఆలయ ఈవో, చైర్మన్ పేరు మీద గోడపత్రాలు, కరపత్రాలు ముద్రించడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది ఆలయానికి చైర్మన్ లేకపోవడం అలుసుగా తీసుకున్న కార్యనిర్వాణాధికారి నిబంధనలకు విరుద్ధంగా గోడపత్రాలపై అధికార పార్టీకి చెందిన నాయకుల ఫొటోలతో ముద్రించడం మండలంలో చర్చనీయాంశమైంది. దేవున్ని కూడా రాజకీయాల్లోకి లాగుతున్నారు అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాక ఈ ఆలయానికి గతంలో పని చేసిన ఈవోలు ఆలయ ఆదాయాన్ని పెంచడం విశేషం. అయితే ప్రస్తుత ఈవో అధికార పార్టీ నేతలతో చేతులు కలిపి ఆలయ ఆదాయాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ప్రతి ఏడాది కార్తిక మాస ఉత్సవాల సందర్భంగా వివిధ కార్యక్రమాలకు గాను ఆలయ ఖాతా నుంచి సుమారు 70 వేల రూపాయల వరకు ఇచ్చేవారు. ప్రస్తుత ఈవో ఈ ఏడాది సుమారు 1,70,000 రూపాయల చెక్కును ఓ అధికార పార్టీ నేత పేరుతో ఇచ్చినట్లు సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి ఆలయ ఆదాయంపై విచారణ చేపట్టినట్లయితే నిజా నిజాలు వెల్లడవుతాయని పలువురు కోరుతున్నారు.

వింత వ్యాధితో ఆవులు మృతి



సరస్వతిపల్లెలో మృతి చెందిన దూడ

రామాపురం : ఆవులు వింత వ్యాధితో మృతి చెందుతుండటంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో ఏళ్లుగా బిడ్డల లాగా పోషించుకున్నామని, కళ్లెదుటే చనిపోతుండటంతో తట్టుకోలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్త చేశారు. మండలంలోని సరస్వతిపల్లె దళితవాడలో నెల రోజులుగా ఒంగోలు జాతి ఆవులకు, దూడలకు చర్మంపై బొబ్బలు రావడం, వారం రోజులలో తల వాపునకు గురై మృత్యువాత పడుతున్నాయి. ఈ వారంలోనే వీరనాగయ్యకు చెందిన దూడ, ఈశ్వరయ్య, నాగులయ్యకు చెందిన ఒంగోలు జాతి ఆవులు, దూడలు మృతి చెందాయి. చర్మంపై పెద్దగా బొబ్బలు రావడంతో వెంటనే పశువుల ఆసుపత్రిని సంప్రదిస్తే అక్కడి సిబ్బంది పట్టించుకోవడం లేదని, మందులు ఇక్కడ లేవని బయటికి వెళ్లి కొనుగోలు చేయాలని చీటి రాసిచ్చారని, ఎన్ని మందులు వాడినా ప్రయోజనం కన్పించలేదని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ప్రతి ఇంటిలో పశువులు ఉన్నాయని, ఈ దిక్కుమాలిన వ్యాధితో ఎన్ని కోల్పోవాల్సి వస్తుందోనని వారు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పశువైద్యాధికారులు స్పందించి పాడి రైతులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వివరణ : మండల పశువైద్యాధికారి వెంకటరమణను 'సాక్షి' వివరణ కోరగా 2023 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మందులు ప్రభుత్వం నుంచి అందలేదని, తామేమి చేయాలని చెప్పారు.

డబ్బులు అడిగినందుకు బీరు సీసాతో దాడి

ప్రొద్దుటూరు క్రైం : తాను పని చేసిన డబ్బులు అడిగినందుకు మహమ్మద్‌గౌస్ అనే యువకుడిపై ఉపేంద్ర పగిలిన బీరు సీసా ముక్కతో దాడి చేశాడు. ఈ సంఘటనలో మహమ్మద్‌గౌస్ తీవ్రంగా గాయ పడ్డాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మహమ్మద్‌గౌస్ జమ్మలమడుగు బైపాస్ రోడ్డులో నివాసం ఉంటున్నాడు. అతను పెయింట్ పని చేసుకొని జీవనం సాగించేవాడు. ఆజా బంకు సమీపంలో నివాసం ఉంటున్న ఉపేంద్ర కూడా అతనితో కలిసి పెయింట్ పని చేస్తుంటాడు. ఇటీవల ఇద్దరు కలిసి ఒక చోట పెయింట్ పని చేశారు. ఆ డబ్బులు మొత్తం ఉపేంద్ర ఒక్కడే తీసుకున్నాడు. విషయం తెలుసుకున్న మహమ్మద్‌గౌస్ తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలని అడుగగా అతను ఇవ్వలేదు. దీంతో మహమ్మద్‌గౌస్ బెదిరించాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి బైపాస్‌రోడ్డులోని ముక్తియార్ ఆయిల్‌మిల్లు వద్ద ఉపేంద్ర కనిపించడంతో డబ్బు ఇవ్వాలని మళ్లీ అడిగాడు. పదే పదే డబ్బులు అడుగుతావా అంటూ అక్కడే ఉన్న గాజు సీసా ముక్కతో మహమ్మద్‌గౌస్ కడుపులో పొడిచి ఉపేంద్ర పరారయ్యాడు. తీవ్ర రక్తగాయాలతో పడిపోయి ఉన్న అతన్ని స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ వెంకటసురేష్ సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వెళ్తున్న బస్సులో నుంచి దూకిన యువతి

- కుమార్తెను కాపాడేందుకు కిందికి దూకిన తల్లి
- ఇద్దరికి తీవ్ర గాయాలు





చికిత్స పొందుతున్న శ్రీలేఖ, గాయపడిన సులోచన

పులివెందుల రూరల్/చక్రాయపేట : పులివెందుల పట్టణంలోని రోటరీపురానికి చెందిన మతిస్థిమితం సరిగా లేని శ్రీలేఖ వెళ్తున్న బస్సులో నుంచి కిందికి దూకింది. ఆమెను కాపాడేందుకు తల్లి సులోచన కూడా కిందికి దూకింది. ఈ సంఘటనలో వారిద్దరూ తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రోటరీపురానికి చెందిన సులోచన, రాముడుకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తె శ్రీలేఖతో కలిసి తల్లి సులోచన కార్తీకమాసం సోమవారం నాడు రాయచోటి సమీపంలోని శివాలయానికి వెళ్లింది. అనంతరం రాయచోటి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో తిరిగి వస్తున్నారు. చక్రాయపేటలోని పెట్రోలు బంకు వద్దకు రాగానే మతిస్థిమితం సరిగా లేని శ్రీలేఖ బస్సులో నుంచి కిందికి దూకింది. ఆమెను కాపాడేందుకు తల్లి కూడా కిందికి దూకింది. దీంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం 108 వాహనంలో వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు.

ఘనంగా మునయ్యస్వామి తిరునాల



అలంకరణలో మునయ్యస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని అవధూత మునయ్య స్వామి ఆలయంలో సోమవారం తిరునాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏటా కార్తిక మాసం చివరి సోమవారం తిరునాల ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం మునయ్య స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని కోళ్లు, మేకలను బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోనే వంటలు వండుకుని బంధుమిత్రులతో కలిసి భోజనాలు చేశారు. పిల్లలకు పుట్టువెంట్రుకలు తీయించి తలనీలాలు సమర్పించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన వివిధ తినుబండారాలు, ఆటవస్తువుల దుకాణాలు, రంగులరాట్నాలు వంటి వాటిలో చిన్నారులు ఆనందోత్సాహాలతో గడిపారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

కడప అర్బన్ : జిల్లాలో ప్రజలు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు ఫిర్యాదుదారులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’ ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు



అపస్మారక స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణ పరిధిలోని ప్రొద్దుటూరు రహదారిలో బైపాస్ రోడ్డు సమీపాన స్కూటర్లు ఢీకొనడంతో.. ఒకరి పరిస్థితి విషమం కాగా మరో వ్యక్తికి స్వల్ప గాయాలు అయిన సంఘటన చోటు చేసుకొంది. సోమవారం పట్టణానికి చెందిన రామాంజనేయులు ప్రొద్దుటూరు వైపు నుంచి జమ్మలమడుగు వస్తుండగా.. వెనుక వైపు నుంచి స్కూటర్ ఢీకొన్న సంఘటనలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు అయినవి. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లగా, రామాంజనేయులుకు స్వల్ప గాయాలైనవి. గుర్తు తెలియని వ్యక్తిని స్థానిక ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

విద్యార్థులపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న ఆర్‌జేడీ రవి

వేంపల్లె : విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ఆర్జేడీ, ఉర్దూ కళాశాల ప్రిన్సిపాల్ రవి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఉర్దూ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రతి రోజూ కళాశాలకు పంపించే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. కళాశాలలో చెప్పిన పాఠాలపై కూడా అప్పుడప్పుడు అడగడంతోపాటు నోటు పుస్తకాలను తనిఖీ చేయాలని సూచించారు. విద్యార్థుల చదువు పట్ల అధ్యాపకులకు ఎంత బాధ్యత ఉందో.. అంతకంటే ఎక్కువగా తల్లిదండ్రులపై కూడా బాధ్యత ఉందన్నారు. సమావేశంలో అధ్యాపకులు భాస్కర్ నాయక్, ఫైరోజ్, షఫి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల బాధ్యత తల్లిదండ్రులు, సంరక్షకులదే

- చెడు అలవాట్లకు దూరంగా వుండేలా చర్యలు తీసుకోవాలి
- ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు



కడప అర్బన్ : పిల్లలు ఉదయం పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లి.. సాయంత్రం ఇంటికి వచ్చిన తరువాత అనవసరంగా బయట తిరగనీయరాదని ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. ఆయన సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులకు కొన్ని సూచనలు చేస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడంతోపాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. పాఠశాల, కళాశాలలో విద్యార్థులు క్రమశిక్షణ లేకుండా, ఆడపిల్లల పట్ల అనుచితంగా ప్రవర్తించినా అలాంటి ఫిర్యాదులు స్కూల్, కాలేజీ యాజమాన్యం నుంచి వచ్చినా టీసీలు ఇచ్చి ఇంటికి పంపిస్తారన్నారు. మరే ఇతర స్కూల్, కాలేజీలో చేర్చుకోని విధంగా చర్యలు ఉంటాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతటి వారైనా అందరికీ ఒకే విధంగా [illegible] తమ పిల్లలు ఎక్కడికి వెళుతున్నారు? ఏం చేస్తున్నారు? ఎలాంటి వారితో స్నేహం చేస్తున్నారు? ఎలాంటి అలవాట్లు చేసుకుంటున్నారు? దుర్వ్యసనాలకు పాల్పడుతున్నారా? అనే విషయాలపై పూర్తి స్పృహ కలిగి వుండాలన్నారు. ఎప్పటికప్పుడు వారి కదలికలపై దృష్టి సారిస్తూ వుండాలన్నారు. పిల్లలకు ఫోన్‌లు, పర్సనల్ కంప్యూటర్లు ఇవ్వడం చేయరాదన్నారు. ఇవ్వాల్సిన పరిస్థితి వస్తే వాటి వినియోగంపై పూర్తి నిఘా వుంచాలన్నారు. అనధికారిక లింక్‌లు టచ్ చేయడం వల్ల కోరి ప్రమాదం తెచ్చుకునే అవకాశం వుందన్నారు. పిల్లలు ధరించే దుస్తులు, హెయిర్ కటింగ్‌పై శ్రద్ధ వహించాలన్నారు. శారీరక శ్రమ అందించే క్రీడలను ప్రోత్సహించి, చెడు అలవాట్లకు దూరంగా వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మీ పిల్లలు చెడు వ్యసనాలకు దూరంగా వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ మీకు చెడు వ్యసనాలు (తాగుడు, గంజాయి, మత్తు మందులు ఇతరత్రా) అలవాటు ఉంటే, వాటి బారిన పడకుండా చూడాలన్నారు. మీ పిల్లలను ఒక కంట కనిపెడుతూ ఉండాలన్నారు. ప్రేమగా చూసుకోవడం మంచిదే కానీ అతి ప్రేమతో వారిని మొండి వారిగా తయారు చేయడం వల్ల సమస్యలు ఎదురవుతాయన్నారు. యువత మత్తుకు బానిసలుగా మారుతున్నారన్నారు. కుటుంబాలు, జీవితాలను నాశనం చేసుకుని అర్ధాంతరంగా ముగించుకుంటున్నారన్నారు. పిల్లలపై పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తూ, చిన్నప్పటి నుంచే ఆధ్యాత్మికత నేర్పించాల్సిన అవసరముందన్నారు. గంజాయి తదితర మాదకద్రవ్యాల మీద పూర్తి నిఘా పెంచామన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మినా, సేవించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మీ పరిధిలో ఎవరైనా మీకు తెలిసి మత్తు పదార్థాలు ఇచ్చేవారు, అమ్మేవారు వుంటే పోలీసులకు తెలియజేసిన పక్షంలో వారిని అదుపులోకి తీసుకుంటామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా వుంచుతామన్నారు. పిల్లల విషయంలో ‘మొక్కై వంగనిది మానై వంగదని’ తల్లిదండ్రులు గమనించాలని వివరించారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలి

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వినతి



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీజీబీ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలోని నాలుగు గ్రామీణ బ్యాంకులు కలిసి ఒకే గ్రామీణ బ్యాంకుగా ఏర్పడుతున్నందున కడపలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని ఆ బ్యాంకు ఉద్యోగ, అధికార సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప ప్రధాన కార్యాలయంగా పని చేస్తున్న ఏపీజీబీ మిగతా గ్రామీణ బ్యాంకులతో పోలిస్తే అతి పెద్దదని, గతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే సొంత భవనం కలిగి ఉందని తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఏ గ్రామీణ బ్యాంకుకు లేనటువంటి కరెన్సీ చెస్ట్ సౌకర్యం కలిగి ఉండడంతోపాటు అత్యంత వెనుకబడిన ప్రాంతంలో ఉండటం వల్ల ప్రతిపాదిత గ్రామీణ బ్యాంకు కడపలోనే కొనసాగించడం అత్యంత ఆవశ్యకమని తెలియజేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ అన్ని కార్యాలయాలు అమరావతిలో కేంద్రీకరించాలని భావిస్తున్న నేపథ్యంలో నూతనంగా ఏర్పడబోతున్న ఈ గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కూడా కడప నుంచి అమరావతికి తరలిపోతుందన్న ఆందోళన, ఏపీజీబీ సిబ్బందితో పాటు ఈ ప్రాంత ప్రజల్లో ఉందన్నారు. మిగతా ప్రాంతాలతో పోల్చి చూసుకుంటే, వెనుకబడిన రాయలసీమలో ఎటువంటి ముఖ్యమైన కార్యాలయాలు గానీ, సంస్థల కార్యాలయాలు లేకపోవడం, మిగతా ప్రాంతంలో అనేక కార్యాలయాలు కలిగి ఉండడమనే అంశాల్ని పరిగణనలోకి తీసుకొని నూతనంగా ఏర్పడబోయే గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలన్నారు. ఈ అంశం పట్ల దృష్టి సారించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కడప నుంచి ప్రధాన కార్యాలయం తరలి వెళ్లకుండా చూడాలని కోరుతున్నామన్నారు. ఇందుకు ఎంపీ స్పందిస్తూ, తన వంతు కృషిని చేస్తానని, పార్లమెంటులో ఈ విషయం లేవనెత్తి కడపలోనే ఏపీజీబీ ప్రధాన కార్యాలయం హెడ్ క్వార్టర్స్ కొనసాగేలా చూడగలనని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం అధ్యక్షులు ఎం.హరిప్రసన్న కుమార్, జనరల్ సెక్రటరీ జగదీశ్వర్‌రెడ్డి, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ టోర్నీలో ద్వితీయ స్థానం



రన్నరప్ ట్రోఫీని ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

వజ్రకరూరు : రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ టోర్నీ విజేతగా విజయనగరం జట్టు నిలిచింది. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామ జెడ్పీహెచ్ఎస్ వేదికగా అండర్ 17 ఎస్‌జీఎఫ్ బాలుర సాఫ్ట్‌బాల్ పోటీలు ఉత్కంఠగా సాగాయి. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన క్రీడా జట్లు పాల్గొనగా సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వైఎస్సార్ జిల్లా జట్టుపై విజయనగరం జట్టు గెలుపొంది విజేత ట్రోఫీని కైవసం చేసుకుంది. రెండో స్థానంలో వైఎస్సార్ జిల్లా, మూడో స్థానంలో అనంతపురం జిల్లా జట్లు నిలిచాయి. విజేత జట్లను అభినందిస్తూ ట్రోఫీలు, పతకాలను డీవైఈఓ శ్రీదేవి ప్రదానం చేశారు. జాతీయ స్థాయిలోనూ రాణించాలని క్రీడాకారులకు ఆమె పిలుపునిచ్చారు. జాతీయ జట్టులో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేయగా, ఇందులో కొనకొండ్ల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి సాయి కార్తీక్‌కు చోటు దక్కడంపై ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టోర్నీ అబ్జర్వర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎసత్యసాయి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ మొరార్జీయాదవ్, సర్పంచ్ ఇందిరమ్మ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సురేష్, పలువురు పీఈటీలు పాల్గొన్నారు. కాగా, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

పులివెందుల రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. పులివెందుల పట్టణం భాకరాపురంలోని తన నివాసంలో ఆయన సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. పులివెందుల నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని పులివెందులలో ఏర్పాటు చేయాలని చాలా మంది దాతలు ముందుకు రావడం జరిగింది. దాతలకు మెమెంటోలు ఇచ్చే కార్యక్రమాన్ని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వేముల మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, మాజీ వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హేమాద్రిరెడ్డి, సుధీకర్‌రెడ్డి, హాలు గంగాధరరెడ్డి, పద్మనాభరెడ్డి, కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి వినతి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీలో నెలకొన్న పలు రకాల సమస్యలను పరిష్కరించాలని కడప ఎంపీ వైఎస్‌అవినాష్‌రెడ్డిని కలిసి మున్సిపల్ చైర్మన్ వాకమళ్లరాజగోపాల్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పుత్తాశ్రీరాములు, మాజీ వైస్‌చైర్మన్ నాగంసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, తుమ్మిశెట్టివెంకటసుబ్బయ్య, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.